సాక్షి
అనంతపురం
మంగళవారం । 27 । జూన్ । 2023



తగ్గిన చీనీ ధర

అనంతపురం మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయల ధర తగ్గింది. టన్ను గరిష్ట ధర రూ.23వేలు పలికింది. 827 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



మళ్లీ వైఎస్సార్‌సీపీదే విజయం

జనరంజక పాలన సాగిస్తున్న వైఎస్సార్‌సీపీనే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోనూ విజయం సాధిస్తుందని ఎమ్మెల్సీ పోతుల సునీత తెలిపారు.

8లో

గరిష్ఠం/కనిష్ఠం
35.4°/22.6°

జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి జల్లులు పడ్డాయి. నైరుతి దిశగా గాలులు గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

ఆరంభంలోనే టమాట అ'ధర'హో



టమాట మండీలో వేలం దృశ్యం

అనంతపురం అగ్రికల్చర్: సీజన్ ఆరంభంలోనే టమాట ధర అదిరిపోయింది. అనంతపురం సమీపంలోని కక్కలపల్లి టమాట మండీలో క్రయ విక్రయాలు మొదలయ్యాయి. సోమవారం మార్కెట్‌కు 1,500 కిలోల టమాటాలు అమ్మకానికి వచ్చాయి. 15 కిలోల బాక్సు ధర ఏకంగా రూ.1000 పలికినట్లు రాప్తాడు మార్కెట్ కమిటీ సెక్రటరీ రామ్మోహన్ రావు తెలిపారు. అంటే కిలో గరిష్ఠ ధర రూ.66 కన్నా అధికంగా పలకడం విశేషం. బహిరంగ మార్కెట్‌లో నాణ్యమైన కిలో టమాట రూ.100 పలుకుతోంది.

అటెండర్ సస్పెన్షన్

- ముగ్గురు సెక్యూరిటీ గార్డులు విధుల నుంచి తొలగింపు
- గురుకులాల డీసీఓకు షోకాజ్ నోటీసు



ప్రిన్సిపాల్, అధ్యాపకులను విచారణ చేస్తున్న గురుకులాల కార్యదర్శి పావనమూర్తి

ఉరవకొండ: గురుకుల పాఠశాల విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన అటెండర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఉరవకొండలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న బాలికపై గత ఏడాది నుంచి అటెండర్ రామాంజనేయులు లైంగికదాడికి పాల్పడుతున్నాడు. కురుగుంట గురుకుల పాఠశాలకు బదిలీ అయినా వీలు దొరికినప్పుడల్లా సాయంత్రం వేళ ఉరవకొండకు చేరుకుని బాలికపై లైంగిక దాడి చేశాడు. బాధితురాలు తన తల్లితో కలిసి ఈ నెల 24న ఉరవకొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగు చూసింది. 25న డీఎస్పీ నర్సింగప్ప ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. అటెండర్‌పై పోక్సో కింద కేసు నమోదు చేశారు. గురుకులాల కార్యదర్శి పావనమూర్తి, జిల్లా కో ఆర్డిటర్ (డీసీఓ) మురళీకృష్ణారావు, ఏఎంఓ సంజీవరావు సోమవారం ఉరవకొండ గురుకుల పాఠశాలకు వచ్చి లైంగిక దాడి ఘటనపై విచారణ చేపట్టారు. అనంతరం గురుకులాల కార్యదర్శి పావనమూర్తి మాట్లాడుతూ లైంగిక దాడి ఆరోపణల నేపథ్యంలో అటెండర్ రామాంజనేయులును సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. బదిలీ అయినా గురుకుల పాఠశాలలో ప్రవేశించడానికి సహకరించిన ముగ్గురు సెక్యూరిటీ గార్డులను విధుల నుంచి తొలగించినట్లు చెప్పారు. ఈ ఘటనకు సంబంధించి డీసీఓ మురళీకృష్ణారావుకు షోకాజ్ నోటీసు జారీ చేశామన్నారు.

ఫ్యాక్షన్ నిర్మూలనకు 'గడప గడపకూ పోలీస్'

- ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు 'ఫుట్‌మార్చ్'



ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై డీఎస్పీ, సీఐలకు సూచనలిస్తున్న డీఐజీ అమ్మిరెడ్డి

తాడిపత్రి అర్బన్: జిల్లాలో ఫ్యాక్షన్‌ను రూపుమాపేందుకు 'గడప గడపకూ పోలీస్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని డీఐజీ అమ్మిరెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి ఆయన తాడిపత్రి పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. అంతకుముందు ఆయన పట్టణంలోని అశోక్‌పిల్లర్, మహాత్మాగాంధీ సర్కిళ్లలో ట్రాఫిక్ తీరును పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లో డీఎస్పీ గంగయ్య, సీఐలు ఆనందరావు, లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎస్ఐ ధరణీబాబుతో డీఐజీ సమావేశమయ్యారు. ఫ్యాక్షన్ నిర్మూలన, ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి సూచనలు, సలహాలు ఇచ్చారు. తర్వాత మీడియాతో డీఐజీ మాట్లాడుతూ గ్రామ స్థాయిలోనే ఫ్యాక్షన్ కదలికలను గుర్తించేందుకు 'గడప గడపకూ పోలీస్' కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. గ్రామస్థాయిలో నెలకొన్న సమస్యలను విలేజ్ పోలీస్, మహిళా పోలీసులు కనుగొని వాటిని ఎస్ఐ, సీఐలు, ఆయా పరిధిలోని డీఎస్పీల దృష్టికి తీసుకొస్తే.. ఫ్యాక్షన్ నిర్మూలించేందుకు వీలుంటుందన్నారు. జిల్లాలో ట్రాఫిక్ సమస్య క్రమబద్ధీకరణకు విజిబుల్ పోలీసింగ్ పేరుతో సాయంత్రం వేళ సీఐ, ఎస్ఐ, పోలీసు కానిస్టేబుళ్లు ప్రధాన రోడ్లపై కాకుండా వీధుల్లో ఫుట్‌మార్చ్ చేపట్టనున్నట్లు చెప్పారు.

మరింత కమ్మని భోజనం

- వసతిగృహాల్లో నూతన మెనూ అమలు
- డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపుపై విద్యార్థుల హర్షం
- ఉమ్మడి జిల్లాలో 23 వేల మంది విద్యార్థులకు లబ్ధి



అనంతపురం వసతి గృహంలో భోజనం చేస్తున్న విద్యార్థినులు (ఫైల్)

అనంతపురం రూరల్: ఇంటి తరహాలో ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లోనూ కమ్మని భోజనం అందుతోంది. రుచికరమైన భోజనం అందిస్తుండటంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉడకని అన్నం, నీళ్ల చారుతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చేది. గదుల కొరత, సరిపడనన్ని మరుగుదొడ్లు, స్నానపుగదులు లేక ఇబ్బందులు పడేవారు. అరకొర డైట్, కాస్మోటిక్ చార్జీలు ఇచ్చేవారు. జగన్ సీఎం అయ్యాక విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిచ్చారు. నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ బడులు, వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచి రూపురేఖలు మార్చారు. సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్న ఉద్దేశంతో పెరిగిన ధరలకు అనుకూలంగా డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందుకు అనుగుణంగానే ఈ విద్యాసంవత్సరం నుంచి నూతన మెనూ అమలు చేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సాంఘిక సంక్షేమశాఖ పరిధిలోని 77 వసతి గృహాల్లో దాదాపు 7వేల మంది విద్యార్థులకు, బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని 109 హాస్టళ్లలో 12 వేల మంది, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో 24 హాస్టళ్లలో దాదాపు 4 వేల మంది విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందుతోంది.

మెరుగైన సౌకర్యాలు..

వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు పోషకాలతో కూడిన భోజనం అందించడంతో పాటు హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఏవిధంగా అయితే నాడు– నేడు పనులు చేపట్టారో అదే తరహాలో వసతి గృహాల్లో పనులు చేపట్టడానికి చర్యలు ప్రారంభించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో దాదాపు 23వేల మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. కొత్త మెనూ అమలుతో పాటు కార్పొరేట్ విద్యా సంస్థల తరహాలో సౌకర్యాలు ఉండటంతో ప్రభుత్వ వసతి గృహాల్లో పూర్తి స్థాయిలో సీట్లు భర్తీ అయ్యాయి.

డైట్ చార్జీల పెంపు ఇలా...

మూడు నుంచి ఐదో తరగతి వరకు గతంలో డైట్ చార్జీలు నెలకు ఒక్కో విద్యార్థికి వెయ్యి రూపాయలు ఉండగా ఇప్పుడు రూ.1150కు పెంచారు. ఐదు నుంచి పదో తరగతి విద్యార్థులకు రూ.1,250 నుంచి రూ.1,400కు, ఇంటర్, ఆపైన చదివే విద్యార్థులకు రూ.1,400 నుంచి రూ.1600 పెంపుదల చేశారు.

పెంచిన కాస్మోటిక్ చార్జీలు ఇలా..

కాస్మోటిక్ చార్జీలు మూడు నుంచి ఆరో తరగతి వరకు బాలురకు రూ.110 నుంచి 120, బాలికలకు రూ.110 నుంచి రూ.130, ఏడు నుంచి పదో తరగతి వరకు బాలురకు రూ.125 నుంచి రూ.150, బాలికలకు రూ. 160 నుంచి రూ. 200, ఇంటర్ ఆపైన చదివే విద్యార్థులకు రూ. 125 నుంచి రూ. 200, విద్యార్థినులకు రూ. 160 నుంచి రూ.200కు ప్రభుత్వం పెంచింది.

అదిరిపోయేలా.. కొత్త మెనూ

- **ఆదివారం** ఉదయం పూరీ– బంగాళదుంప బఠాణీ కూర్మా, గుడ్డు, మల్టీ మిల్లెట్ చిక్కీ, మధ్యాహ్నం చికెన్ బిరియాని, రైతా, గోంగూర, చట్నీ, సాయంత్రం సేమియా పాయసం, రాత్రి అన్నం, సాంబారు, క్యారెట్ పెసరపప్పు కూర, మజ్జిగ, అరటిపండు అందించనున్నారు.
- **సోమవారం** ఉదయం పాలు, చింతపండు పులిహోరా, శనగ పప్పు పొడి, చిక్కీ, సాయంత్రం ఉడికించిన బఠాణీ గుగ్గిళ్లు, రాత్రి అన్నం, కోడి గుడ్డు, టమాట కూర, రసం, మజ్జిగ, జామ పండు.
- **మంగళవారం** ఉదయం పాలు, ఇడ్లీ, చట్నీ, చిక్కీ, సాయంత్రం రాగిలడ్డు, రాత్రి తాళింపు, అన్నం, చికెన్ కర్రీ, రైతా, గోంగూర చట్నీ, గుడ్డు, అరటిపండు.
- **బుధవారం** ఉదయం పాలు, జీలకర్ర అన్నం, కూరగాయల కూర, చిక్కీ, సాయంత్రం ఉడికించిన అలసంద గుగ్గిళ్లు, రాత్రి అన్నం, గుడ్డు, టమాట కర్రీ సాంబారు, మజ్జిగ, జామ పండు.
- **గురువారం** ఉదయం పాలు, గోధుమ రవ్వ ఉప్మా, చట్నీ, చిక్కీ, సాయంత్రం మరమరాల మిక్చర్, రాత్రి అన్నం, బెండకాయ ఫ్రై, సాంబారు, మజ్జిగ, గుడ్డు, అరటిపండు.
- **శుక్రవారం** ఉదయం పాలు, పెసర పొంగల్, చట్నీ, చిక్కీ, సాయంత్రం పచ్చి శనగ గుగ్గిళ్లు, రాత్రి తాళింపు అన్నం, చికెన్ కర్రీ, గోంగూర చట్నీ, గుడ్డు, రైతా, మజ్జిగ, జామ పండు.
- **శనివారం** ఉదయం పాలు, ఇడ్లీ, చట్నీ, చిక్కీ, సాయంత్రం రవ్వ కేసరి, రాత్రి అన్నం, దొండకాయ కూర, పాలకూర పప్పు, మజ్జిగ, అరటిపండు.

(గమనిక : సోమవారం నుంచి శనివారం వరకు మధ్యాహ్న వేళల్లో పాఠశాలల్లో జగనన్న గోరు ముద్ద పథకం కింద భోజనం పెడతారు)

రుచికరమైన భోజనం



ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచడం వల్ల మాలాంటి ఎంతో మంది పేద విద్యార్థులకు రుచికరమైన భోజనం అందుతుంది. హాస్టళ్లలో ఇప్పటికే మెరుగైన సౌకర్యాలు ఉన్నాయి. నూతన మెనూతో పోషకాహారం అందితే చదువులు సాఫీగా సాగుతాయి.

– స్ఫూర్తి, పదో తరగతి, ఎస్సీ నంబర్–2 హాస్టల్, అనంతపురం

పేద విద్యార్థులకు వరం



ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల మాలాంటి ఎంతో మంది పేద విద్యార్థుల చదువులు సాఫీగా సాగుతున్నాయి. ఇప్పటికే పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం రుచికరంగా ఉంది. పెరిగిన ధరలకు అనుగుణంగా నూతన మెనూ అమలు చేస్తుండటంతో వసతి గృహాల్లోనూ కమ్మనైన భోజనమే అందుతోంది.

– రోహిత్ 9 వతరగతి, ఎస్సీ నంబర్–4 హాస్టల్, అనంతపురం

పక్కాగా మెనూ అమలు

నూతన మెనూ అమలుకు చర్యలు తీసుకున్నాం. హాస్టళ్ల విద్యార్థులందరికీ డైట్ చార్జీలు పెంచడంతో పోషకాలతో కూడిన భోజనాన్ని అందిస్తున్నాం. విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు రుచికరమైన భోజనం అందించే విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు. విధుల్లో వార్డెన్లు నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు.

– మధుసూదన్‌రావు (సాంఘిక సంక్షేమశాఖ జేడీ), కుష్బూ కొఠారి (బీసీ సంక్షేమశాఖ డీడీ)

'సమగ్ర శిక్ష'లో మరో వికెట్ ఔట్

- అటెండర్‌ను విధుల నుంచి తప్పిస్తూ ఉత్తర్వుల జారీ

రాప్తాడురూరల్: అనంతపురంలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో మరో వికెట్ పడింది. శ్రీసత్యసాయి జిల్లాలోని నాబార్డు స్కూళ్లు, కేజీబీవీ జూనియర్ కళాశాలల్లో నిర్మాణ పనుల పేరుతో సాగించిన సిమెంట్ దందాలో అటెండర్‌ను విధుల నుంచి తప్పిస్తూ సోమవారం సాయంత్రం అనంతపురం కలెక్టర్ గౌతమి ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజుల కిందట కంప్యూటర్ ఆపరేటర్‌ను విధుల నుంచి తప్పించిన సంగతి తెలిసిందే. అలాగే 'మనబడి నాడు–నేడు' పనులతో పాటు ఇతర ప్రభుత్వ పనులకు వినియోగిస్తున్న సిమెంట్ కోసం ఇండెంట్ విషయంలో ఒకటికి రెండుసార్లు లాగిన్లు పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

అక్రమార్కుల్లో వణుకు..

కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్‌ను విధుల నుంచి తొలగించడంతో పాటు వారిద్దరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని అనంతపురం కలెక్టర్ గౌతమి, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా సమగ్ర శిక్ష ఈఈ మంగళవారం అనంతపురం వతతన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నారు. పోలీసు కేసు నమోదు కానుండడంతో అక్రమార్కుల్లో వణుకు పట్టుకుంది. సమగ్ర శిక్ష ఈఈ కార్యాలయంలోని ఇద్దరు ఉద్యోగులతో పాటు వీరి వెనుక ఉన్న వారందరినీ పోలీసుల దర్యాప్తులో బయటకు లాగనున్నారు. కొందరు సైట్ ఇంజినీర్లతో పాటు అధికారుల పాత్రపైనే అనుమానాలు తలెత్తుతున్నాయి.

డిపార్ట్‌మెంటల్ విచారణకు ఆదేశం!

సిమెంట్ దారి మళ్లింపు వ్యవహారంపై ఓవైపు పోలీసుల దర్యాప్తుతో పాటు మరోవైపు శ్రీసత్యసాయి కలెక్టర్ అరుణ్‌బాబు డిపార్ట్‌మెంటల్ విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. సమగ్ర శిక్ష అధికారులతో కాకుండా ఇతర డిపార్ట్‌మెంటల్ అధికారులతో సమగ్రంగా విచారించనున్నట్లు సమాచారం.

గడువులోపే అర్జీలు పరిష్కరించాలి

- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: 'స్పందన', 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాల ద్వారా ప్రజల నుంచి అందే అర్జీలను గడువులోపే పరిష్కరించాలని కలెక్టర్ ఎం.గౌతమి జిల్లా అధికారులను ఆదేశించారు. ఏ స్థాయిలోనూ నిర్లక్ష్యానికి తావివ్వకూడదని హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'స్పందన'లో కలెక్టర్‌తో పాటు డీఆర్ఓ గాయత్రీదేవి, డిప్యూటీ కలెక్టర్లు కేశవనాయుడు, శ్రీనివాసులు, శంకరయ్య, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి ప్రజల నుంచి వివిధ సమస్యలపై 646 అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ 'స్పందన' అర్జీల పరిష్కారంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. 'స్పందన', 'జగనన్నకు చెబుదాం' అర్జీలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలన్నారు. గడువు వరకు ఆగకుండా అర్జీదారులు సంతృప్తి చెందేలా వీలైనంత త్వరగా నాణ్యమైన పరిష్కారం చూపించాలన్నారు.

అర్జీల్లో కొన్ని...

☛ సర్వజనాస్పత్రి రక్తనిధి కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న తనను 2020 సంవత్సరంలో అకారణంగా తొలగించారని ప్రభావతి కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. విచారణ జరిపి.. తనకు ఉద్యోగి తిరిగి ఇప్పించాలని వేడుకున్నారు.

☛ ఉపాధి హామీ పథకం కింద 2021–22 ఆర్థిక సంవత్సరంలో చేసిన పనులకు నేమ్ బోర్డు పెట్టకుండా అక్రమంగా రూ.52 వేలు బిల్లు చేయించుకున్న ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని బ్రహ్మసముద్రం మండలం భైరవానితిప్ప సర్పంచ్ సి.మంజూనాథ్ ఫిర్యాదు చేశారు.

☛ ప్రభుత్వ వైద్య కళాశాల, సర్వజనాస్పత్రిలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న తమకు కాంట్రాక్టు ఏజెన్సీ కొన్ని నెలలుగా వేతనం చెల్లించలేదని ఏఐటీయూసీ జిల్లా ఉపప్రధాన కార్యదర్శి మల్లికార్జున ఆధ్వర్యంలో ఏపీ మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగ, కార్మి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, కార్మికులు భార్గవి, లక్ష్మీదేవి, తదితరులు ఫిర్యాదు చేశారు. వేతనంలో కూడా కోత విధిస్తున్నారని, విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

అక్రమాలకు కళ్లెం పడేనా?

- ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఎన్నెన్ని సిత్రాలో
- జేఎన్‌టీయూఏ అనుబంధ హోదా కోసం మాయ
- మొదలైన నిజ నిర్ధారణ కమిటీల పరిశీలన



అనంతపురం జేఎన్‌టీయూ ముఖద్వారం

అనంతపురం: జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం–అనంతపురం (జేఎన్‌టీయూఏ) అనుబంధ హోదా కోసం కొన్ని ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలు మాయ చేస్తున్నాయి. గత ఏడాది నిజ నిర్ధారణ కమిటీ తనిఖీల్లో ఒక ప్రొఫెసర్ 40 ఇంజినీరింగ్ కళాశాలల్లో పనిచేస్తున్నట్లు బయటపడింది. చాలామంది ప్రొఫెసర్లు బయోమెట్రిక్ హాజరు వేసి తరగతుల ముఖం చూడకుండా వెళ్లిపోతున్నారు. ఆ ఏడాది అధికారులు 30 ఇంజినీరింగ్ కళాశాలలకు షోకాజ్ నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకున్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంజినీరింగ్ కళాశాలలకు యూనివర్సిటీ అనుబంధ హోదా ఇచ్చేందుకు నిజ నిర్ధారణ కమిటీలు పరిశీలన ప్రక్రియ మొదలు పెట్టాయి. జేఎన్‌టీయూఏ పరిధిలో మొత్తం 97 ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి.

రికార్డుల్లోనే ఫ్యాకల్టీ – వేతనాలు..

బీటెక్ పూర్తయిన వారు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల వైపు వెళ్తున్నారు. దీంతో ఎంటెక్, పీహెచ్‌డీ కోర్సుల వైపు ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు దృష్టి సారించడం లేదు. ఫలితంగా ఎంటెక్, పీహెచ్‌డీ చేసి అధ్యాపక వృత్తిలోకి వచ్చే వారు కరువయ్యారు. ఎంటెక్ పూర్తి చేసిన వారు దొరుకుతున్నప్పటికీ, పీహెచ్‌డీ పూర్తి చేసిన వారు అరకొరగానే అందుబాటులోకి వస్తున్నారు. పీహెచ్‌డీ డిగ్రీ ఉంటేనే బ్రాంచ్‌ల్లో విభాగాధిపతిగా ఉండడానికి అర్హులు. అసోసియేట్ ప్రొఫెసర్‌లు కావాలంటే తప్పనిసరిగా పీహెచ్‌డీ చేసిన వారు ఉండాల్సిందే. ఈ క్రమంలో పీహెచ్‌డీ చేసిన వారి కొరత కావడంతో అనుబంధ హోదా గుర్తింపు నిమిత్తం పరిశీలనకు వస్తున్న నిజ నిర్ధారణ కమిటీ (ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ) కళ్లుగప్పి పనిచేయకున్నా.. తమ కళాశాలలో పనిచేస్తున్నట్లు రికార్డుల్లో చూపించుకుంటున్నారు. పైగా గరిష్ఠంగా వేతనాలు ఇస్తున్నట్లు సైతం లెక్కల్లో చూపిస్తున్నారు.

ఎమర్జింగ్ కోర్సుల్లో మరింత తీవ్రం..

కంప్యూటర్ సైన్సెస్ వాటి అనుబంధ బ్రాంచ్‌లైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్– మెషీన్ లెర్నింగ్, డేటా సైన్సెస్, బ్లాక్ చైనా టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వంటి కోర్సుల్లో బోధించేవారు కరువయ్యారు. సరైన అర్హత లేని అధ్యాపకులు ఉండడమే ఇందుకు కారణం. ఈ నూతన కోర్సులు ఇటీవలే అమల్లోకి తెచ్చారు. ఈ నేపథ్యంలో ఇందుకు తగ్గట్టు బోధనా సామర్థ్యం ఉన్న అధ్యాపకులు లేరు. సరైన ల్యాబ్ సదుపాయాలు లేవు. అయినప్పటికీ వందలాది మంది విద్యార్థులను ఎమర్జింగ్ కోర్సుల్లో అడ్మిషన్లు తీసుకుంటున్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి అనుబంధ గుర్తింపు ఇచ్చేందుకు నియమించిన నిజనిర్ధారణ కమిటీల పరిశీలన ప్రారంభమైంది. ఈ ఏడాది అయినా అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల అక్రమాలకు కళ్లెం వేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

వసతులు లేకుంటే గుర్తింపు నిరాకరణ..

అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలలు పొందుపరిచిన విధంగా వసతులు లేకపోతే తక్షణ చర్యలు తీసుకుంటాం. నిజ నిర్ధారణ కమిటీలు ప్రతి అంశాన్నీ క్షుణ్ణంగా పరిశీలిస్తాయి. ఏదైనా అనుమానం ఉంటే నేరుగా కళాశాలకు వెళ్లి తనిఖీ చేస్తాయి. ఇంజినీరింగ్ కళాశాలలు నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే అనుబంధ గుర్తింపు ఇవ్వబోం.

– జింకా రంగజనార్దన, వీసీ, జేఎన్‌టీయూఏ

మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దు



అనంతపురం టవర్‌క్లాక్ వద్ద యువత, పోలీసుల మానవహారం

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: మాదక ద్రవ్యాల(డ్రగ్స్)కు బానిసలై జీవితాలను బుగ్గి చేసుకోవద్దని ఎస్పీ కె.శ్రీనివాసరావు యువతకు హెచ్చరించారు. సోమవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ – సెబ్ ఆధ్వర్యంలో అనంతపురంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ పచ్చ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. అంబేడ్కర్ విగ్రహం నుంచి సప్తగిరి సర్కిల్, సుభాష్ రోడ్డు మీదుగా క్లాక్ టవర్ వద్దకు చేరుకుని మానవహారంగా ఏర్పడ్డారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ఈ సందర్భంగా ఎస్పీ అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మాదక ద్రవ్యాల జోలికెళ్తే ఉజ్వల భవిష్యత్తును పాడు చేసుకోవడంతో పాటు ఆరోగ్యపరంగా, మానసికంగా నాశనమయ్యే ప్రమాదముందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రగ్స్‌కు ఆకర్షితులు కారాదని యువతకు హితవు పలికారు. ఇప్పటికే ఎవరైనా అలవాటు పడి ఉంటే మానేందుకు డీ అడిక్షన్ సెంటర్‌కు తీసుకురావాలని సూచించారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాల గురించి తెలిసేలా విద్యాసంస్థల వద్ద బోర్డులు ఏర్పాటు చేసి చైతన్యం తీసుకొస్తున్నామన్నారు. తమ ప్రయత్నానికి ప్రజల సహకారం తోడైతే లక్షలాది మంది పిల్లల జీవితాలను చక్కదిద్దినవారవుతామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్ విజయభాస్కర్‌రెడ్డి, జి.రామకృష్ణ, ఎ.హనుమంతు, అనంతపురం డీఎస్పీ జి.ప్రసాదరెడ్డి, సీఐలు శివరాముడు, కత్తి శ్రీనివాసులు, ప్రతాప్‌రెడ్డి, వెంకటేష్ నాయక్, చిన్న గోవింద్, సెబ్ సీఐ నరసానాయుడు, పలువురు సెబ్ ఎస్ఐలు, ఆర్ ఎస్ఐలు రాజశేఖర్‌రెడ్డి, భాస్కర్, బాలజీ నాయక్, పలువురు గ్రామ, వార్డు మహిళా పోలీసులు, దిశ పెట్రోలింగ్ బృందాలు, వివిధ కళాశాలల విద్యార్థులు, యువతీ యువకులు, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల జారీలో జాప్యం చేయొద్దు

కూడేరు: అర్హతను బట్టి కుల, ఆదాయ, జనన, మరణ, వివాహ, కుటుంబ సర్టిఫికెట్లు, మ్యుటేషన్, ఫోన్ నంబర్లకు ఆధార్ లింక్ సేవలు, కౌలు రైతులకు గుర్తింపు కార్డుల జారీలో జాప్యం చేయొద్దని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్, జిల్లా ప్రత్యేక అధికారి అరుణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్‌తో కలిసి గొటుకూరులో జరుగుతున్న 'జగనన్న సురక్ష' ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అనంతరం సచివాలయంలో మండల అధికారులతో సమావేశమయ్యారు. ధ్రువీకరణ పత్రాలు మంజూరు, ఇతర సమస్యలకు ఉచితంగా సేవలందించాలన్నదే 'జగనన్న సురక్ష' కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. తర్వాత కూడేరులోని జగనన్న లే–అవుట్‌లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అటు నుంచి రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఎస్ఓ శోభారాణి, డీపీఓ ప్రభాకర్‌రావు, ఆర్డీఓ మధుసూదన్, డీఎల్‌డీఓ ఓబుళమ్మ, అగ్రికల్చర్ ఏడీ రవి, తహసీల్దార్ శేషారెడ్డి, ఎంపీడీఓ ముస్తఫా కమాల్‌బాషా, హౌసింగ్ ఏఈ శేఖర్, ఏఓ విజయకుమార్, ఎంపీపీ నారాయణరెడ్డి, సర్పంచ్ ఆశాలత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి అరుణ్‌కుమార్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



వైఎస్సార్ లా నేస్తం మెగా చెక్కును జూనియర్ న్యాయవాదులకు అందజేస్తున్న ఎంపీ రంగయ్య, కలెక్టర్ గౌతమి

- అన్ని వర్గాలకూ ఆర్థిక చేయూత
- లా నేస్తం ద్వారా అర్హులైన లాయర్లకు స్టైఫండ్
- జిల్లాలో 98 మందికి రూ.24.50 లక్షలు మంజూరు

అనంతపురం అర్బన్: ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎంపీ తలారి రంగయ్య, కలెక్టర్ గౌతమి అన్నారు. అన్ని వర్గాలకూ ఆర్థిక చేయూతనిచ్చే పథకాలను అమలు చేస్తోందన్నారు. వైఎస్సార్ లా నేస్తం ద్వారా అర్హులైన జూనియర్ న్యాయవాదుల ఖాతాలకు 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఫిబ్రవరి నుంచి జూన్ వరకు నెలకు రూ.5వేల చొప్పున ఐదు నెలలకు మొత్తం రూ.25వేల స్టైఫండ్‌ను జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి కంప్యూటర్ బటన్ నొక్కి ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి ఎంపీ తలారి రంగయ్య, కలెక్టర్ గౌతమి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం తదితరులు పాల్గొన్నారు. ఎంపీ, కలెక్టర్ మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలూ వారి వృత్తుల్లో నిలదొక్కుకునేందుకు ముఖ్యమంత్రి ఆర్థిక తోడ్పాటునందిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా యువ న్యాయవాదులను ప్రోత్సహించేందుకు 'వైఎస్సార్ లా నేస్తం' పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ పథకం ద్వారా అర్హులైన లాయర్లకు నెలకు రూ.5 వేలు స్టైఫండ్‌ను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. పథకం కింద జిల్లాలో 98 మంది జూనియర్ న్యాయవాదులకు సంబంధించిన రూ.24.50 లక్షల మెగా చెక్కును విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారుడు (దేవదాయ శాఖ) జ్వాలాపురం శ్రీకాంత్, రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ హరిత, గ్రంథాలయ చైర్‌పర్సన్ ఎల్.ఎం. ఉమాదేవి, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు ఉమాపతి, రామిరెడ్డి, యువ న్యాయవాదులు స్వాతి, చంద్ర పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుపై నేడు అవగాహన సదస్సు

అనంతపురం టౌన్: అంతర్జాతీయ ఎంఎస్ఎంఈ దినాన్ని పురస్కరించుకుని పరిశ్రమల ఏర్పాటుపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజరావు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అందజేసే రాయితీలు, ప్రోత్సాహకాలపై అవగాహన కల్పించనున్నారు. మంగళవారం ఉదయం 10గంటలకు జేఎన్‌టీయూ రోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన ఉన్న కామర్స్ భవనంలో సమావేశం ఉంటుంది. సదస్సుకు ఏపీఐఐజీ జోనల్ మేనేజర్ వరప్రసాద్‌రావుతో పాటు రూడ్‌సెట్ డైరెక్టర్ విజయలక్ష్మి హాజరు కానున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు.

మళ్లీ వైఎస్సార్‌సీపీదే విజయం

- ఎమ్మెల్సీ పోతుల సునీత


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పోతుల సునీత

అనంతపురం క్రైం: ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని ఎమ్మెల్సీ పోతుల సునీత అన్నారు. మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించడం ఖాయమన్నారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే తానిచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం అనేక విప్లవాత్మక సంస్కరణలు చేపట్టారన్నారు. నాలుగేళ్ల పాలనలో రూ.2.10 లక్షల కోట్ల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ చేశారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జ్యోతిబా పూలే ఆశయాలకు అనుగుణంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనసాగిస్తూ ఆయా వర్గాల అభ్యున్నతికి 55 శాతం రిజర్వేషన్ కల్పించారని కొనియాడారు. దీంతో బీసీలకు సుస్థిర స్థానం దక్కిందన్నారు. 14 ఏళ్ల పాటు సీఎంగా పనిచేసినట్లు గొప్పలు చెప్పుకునే చంద్రబాబు రాజకీయ జీవితం మొత్తం కుట్రలు, కుతంత్రాలతోనే సాగిందని విమర్శించారు. ఇప్పటికే అదే పంథాను కొనసాగిస్తూ జగన్ సర్కార్‌పై ఎల్లో మీడియాతో విషపు రాతలు, గ్లోబెల్ ప్రచారం చేయిస్తున్నారని మండిపడ్డారు. లోకేష్ పాదయాత్ర కాస్త కామెడీ గళంగా మారిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌పై ప్యాకేజీ మాస్టర్‌గా మారిన పవన్‌కళ్యాణ్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని, ఆయనను అక్క, చెల్లెమ్మలే తరికొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. అనంతరం పోతుల సునీతను డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి కొండమ్మ, జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, కార్పొరేటర్లు ఘనంగా సన్మానించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నేత పోతుల సురేష్, నాయకురాళ్లు ఉషారాణి, పార్వతి, భారతి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమం కోసమే జగనన్న సురక్ష..

వజ్రకరూరు: ప్రజా సంక్షేమం కోసమే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపడుతోందని ఎమ్మెల్సీ పోతుల సునీత అన్నారు. వజ్రకరూరు మండలం గంజికుంటలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష బ్యానర్‌ను మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరెడ్డితో కలసి సోమవారం ఆమె ఆవిష్కరించి, మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందజేసే బృహత్త కార్యక్రమానికి జగన్ సర్కార్ శ్రీకారం చుట్టిందన్నారు. విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా గొప్ప సంస్కరణలు అమలు చేసి తిరుగులేని నాయకుడిగా సీఎం వైఎస్ జగన్ ఖ్యాతి గడించారన్నారు. రానున్న సార్వత్రి క ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపు ఖాయమన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

'పోలీసు స్పందన'కు 136 వినతులు


అర్జీదారుతో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 136 వినతులు అందాయి. ఎస్పీ కె.శ్రీనివాసరావు స్వయంగా వినతులు స్వీకరించి, సమస్య తీవ్రతపై అర్జీదారులతో ఆరా తీశారు. చట్టపరిధిలోని సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కర్ రెడ్డి, జి.రామకృష్ణ, ఎస్బీ సీఐ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ లక్ష్యం రూ.2వేల కోట్లు

- మహాజన సభలో చైర్‌పర్సన్ ఎం.లిఖిత


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ లిఖిత

అనంతపురం అగ్రికల్చర్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిల్లా సహకార బ్యాంకు (డీసీసీబీ) టర్నోవర్ రూ.2వేల కోట్ల మార్క్‌ను చేరుకునేలా కలసికట్టుగా పనిచేయాలని బ్యాంక్ ఉద్యోగులు, పాలక వర్గ సభ్యులకు ఆ బ్యాంక్ చైర్‌పర్సన్ ఎం.లిఖిత సూచించారు. స్థానిక డీసీసీబీ హాలులో సీఈఓ ఏబీ రామ్‌ప్రసాద్ అధ్యక్షతన సోమవారం జరిగిన 125వ మహాజన సభలో ఆమె మాట్లాడారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.1.04 కోట్లు నికరలాభం రావడం మంచి పరిణామమని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను ఇప్పటికే బ్యాంకు లావాదేవీలు రూ.1,600 కోట్లు దాటిందన్నారు. ఈ ఏడాది ఆఖరులోపు రూ.2వేల కోట్లకు చేరాలన్నారు. నిరర్థక ఆస్తులు 5 శాతానికి తగ్గించాలన్నారు. ప్రస్తుతం 444 రోజుల కాలపరిమితి కలిగిన డిపాజిట్లపై 7.70 శాతం, సీనియర్ సిటిజన్లకు 8.20 శాతం వడ్డీరేటు వర్తిస్తుందని, ఈ అంశంపై ప్రజలను చైతన్య పరిచి డిపాజిట్లు సేకరించాలన్నారు. సభలో డైరెక్టర్లు హైదర్‌వలి, శంకర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, రామాంజనేయులు, రమణమూర్తి, అబ్దుల్ రఖీబ్, ఆప్కాబ్ ప్రతినిధి లావణ్య, బ్యాంకు జీఎం సురేఖారాణి, డీజీఎంలు సుఖదేవబాబు, రవికుమార్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలతో అనర్థం


ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి

అనంతపురం క్రైం: మాదక ద్రవ్యాల వినియోగం అనర్థదాయకమని, దీని వల్ల మానసిక, శారీరక సమస్యలు తలెత్తే ప్రమాదముందని యువతకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి జెడ్పీ కార్యాలయం మీదుగా తిరిగి డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి ర్యాలీ చేరుకుంది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ గంజాయిలో ఉండే టెట్రా హైడ్రోకెనబినాయిడ్(టీహెచ్‌సీ) అనే రసాయనం మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుందని, దీని వల్ల శ్రద్ధ, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి దెబ్బతింటుందన్నారు. మత్తు ప్రభావానికి లోనైన వ్యక్తులు చిత్త భ్రమలకు లోనై ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలు రేకెత్తిస్తాయన్నారు. మత్తుకు దూరంగా ఉంటే పరిపూర్ణ జీవితాన్ని అనుభవించవచ్చునన్నారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి డాక్టర్ మనోజ్‌కుమార్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ డీపీఎం వెంకటరత్నం, రెడ్స్ సంస్థ మేనేజర్ నరేష్, భాస్కర్, షంషాద్, షెక్షావలి పాల్గొన్నారు.

గోవధ నిషేధం

అనంతపురం అగ్రికల్చర్: గోజాతి పశువులు, గేదె జాతి లేగ దూడలు, ఒంటెలను మాంసం కోసం వధించడం, బలి అర్పించడాన్ని నిషేధిస్తూ కలెక్టర్ గౌతమి సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి సుబ్రమణ్యం తెలిపారు. ఏ మత పరమైన కార్యక్రమాల్లో వీటిని వధించినా చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. 1977 గోవధ నిషేధ చట్టం, 1960 జంతు హింస నిరోధక చట్టం ప్రకారం రాష్ట్రంలో వీటిని నిషేధించినట్లు తెలిపారు. అలాగే పరిమితికి మించి పశువులు, గేదెలు వాహనాలలో రవాణా చేయడం నేరమన్నారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహకం

బుక్కరాయసముద్రం: ఉద్యాన పంటల సాగుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకం అందజేస్తోందని రైతులకు నేషనల్ హార్టికల్చర్ బోర్డు అడిషనల్ డైరెక్టర్ ఏకే శర్మ సూచించారు. ఉద్యాన పంటల సాగు– రాయితీలపై సోమవారం రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. తక్కువ నీటితో సూక్ష్మ సేద్యం ద్వారా చేపట్టే ఉద్యాన పంటల సాగు ఎంతో లాభదాయకంగా ఉంటుందన్నారు. చీనీ, దానిమ్మ, ద్రాక్ష, జామ, మామిడి, సపోట, బొప్పాయి, కొబ్బరి, చింత పంటల సాగుకు 40 శాతం రాయితీని ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో రెడ్డిపల్లి కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ మల్లేశ్వరి, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఆలమూరు సుబ్బారెడ్డి, ఆదర్శ రైతు విజయభాస్కరరెడ్డి, ఉద్యాన శాఖ అధికారులు బేగం, పల్లవి, ధనుంజయ, రత్నకుమార్, కేవీకే శాస్త్రవేత్తలు సుధారాణి, డాక్టర్ కిషోర్‌రెడ్డి, డాక్టర్ మాధవి, డాక్టర్ శశికళ, డాక్టర్ చందన ఉమ్మడి జిల్లా రైతులు పాల్గొన్నారు.

బాధిత బాలికకు అండగా ఉంటాం

- మంత్రి ఉషశ్రీ చరణ్


ఐసీడీఎస్ అధికారులతో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీ చరణ్

అనంతపురం సెంట్రల్: ఉరవకొండలోని హాస్టల్‌లో అత్యాచారానికి గురైన బాలికకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర మహిళాశిశు సంక్షేమశాఖ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను సోమవారం మంత్రి పరామర్శించారు. అనంతరం దిశ-వన్‌స్టాప్ సెంటర్‌లో బాలిక ఆరోగ్య పరిస్థితిపై వైద్యాధికారులు, ఐసీడీఎస్ అధికారులతో చర్చించారు. జిల్లాలో ఇలాంటి ఘటన జరగడం బాధాకరమన్నారు. బాలిక కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఈ నేరానికి పాల్పడిన, సహకరించిన వారందరిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి, వన్‌స్టాప్ సిబ్బంది, వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఎస్కేయూలో అంతర్జాతీయ సదస్సు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని మేథమేటిక్స్ విభాగంలో ఈ నెల 28 నుంచి 30 తేదీ వరకు అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. 'ఇన్నోవేషన్స్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్ మేథమేటికల్ సైన్స్ అండ్ టెక్నాలజీ' అనే అంశంపైన నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సుకు ఉన్నత విద్యామండలి చైర్మన్ కే హేమచంద్రా రెడ్డి, మాజీ యూపీఎస్సీ సభ్యుడు ప్రొఫెసర్ వై. వెంకట్రామిరెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరుకానున్నారు. వీరితో పాటు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ డీన్ ప్రొఫెసర్ డీఎస్ నాగరాజు పాల్గొననున్నారు. జర్మనీ, మలేషియా, ఫిజీ, అమెరికా దేశాల నుంచి 200 మంది వర్సిటీ పూర్వ విద్యార్థులు, ప్రముఖులు హాజరుకానున్నారు.

'ప్రత్యేక గ్రీవెన్స్'పై ఉద్యోగుల హర్షం

రాప్తాడు రూరల్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతి నెలా 3వ శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడంపై వైఎస్సార్ టీఎఫ్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఓబుళపతి, గౌరవ అధ్యక్షుడు హెచ్.గిరిధర్‌రెడ్డి, కోశాధికారి వి.రాజమోహన్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ టీవీ రమణారెడ్డి, ఉపాధ్యక్షులు చల్లా ప్రసాద్ రెడ్డి, సురేష్‌కుమార్, విశ్వనాథరెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు మల్లయ్య, డాక్టర్ వెంకటరెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షుడు భాస్కర్ డ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్తాఫ్ హుస్సేన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వీరాంజనేయులు తదితరులు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని గతంలో ఏ ముఖ్యమంత్రి ఆలోచించలేదన్నారు. ఈ స్ఫూర్తితో ప్రభుత్వ అన్ని శాఖల్లో నెలలో ఒకరోజు గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

టీడీపీది నయవంచన

- జగన్ పాలన దేశానికే ఆదర్శం
- విప్ కాపు రామచంద్రారెడ్డి


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: చిత్తశుద్ధి లేని హామీలతో ప్రజలను నమ్మించి, ఆ తర్వాత వంచనకు గురి చేయడంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సిద్ధహస్తుడని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి విమర్శించారు. స్థానిక రోడ్లు, భవనాలశాఖ అతిథి గృహంలో సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలు దగ్గర పడే కొద్దీ బాబు మోసాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయన్నారు. 2014 ఎన్నికల్లో ఇచ్చిన 610 హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని గుర్తు చేశారు. భర్తలు ఉన్న వారికి సైతం వితంతు పెన్షన్ మంజూరు చేయించి దేశ సంస్కృతిని కాలరాచిన దుర్మార్గుడు మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులని మండిపడ్డారు. 2024 ఎన్నికల తర్వాత టీడీపీ పూర్తిగా కనుమరుగు కావడం ఖాయమన్నారు.

జగన్ సుపరిపాలన దేశానికే ఆదర్శమన్నారు. పేదల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ ఎన్నో సంస్కరణలు, హామీలు అమలు చేశారన్నారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష పేరుతో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. జగనన్న సురక్షతో అన్ని వర్గాలకూ న్యాయం చేకూరుతుందన్నారు. బొమ్మనహాళ్ మండలం గౌనూరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టినప్పుడు గ్రామంలో సుమారు 150 ఇళ్లుంటే 11 ఇళ్లవారు మాత్రమే డోర్ లాక్‌చేసి పనులకెళ్లారన్నారు. ఈ అంశాన్ని ఎల్లో మీడియా ఎత్తి చూపుతూ బురద చల్లే ప్రయత్నం చేయడం సిగ్గు చేటన్నారు. గౌనూరుకు రోడ్డేసింది, ఈ నాలుగేళ్లలో అన్ని విధాలుగా ఆ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించింది తామేనన్నారు. నిజాన్ని ప్రచురించామనే నమ్మకముంటే గౌనూరుకు తమతో పాటు కలసి వస్తే వాస్తవమేంటో నిరూపిస్తామని ఎల్లో మీడియాకు సవాల్ విసిరారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, నాయకులు ముస్తాక్, శ్రీనివాసులు, బీటీపీ గోవిందు, కౌన్సిలర్ శారద, పార్టీ నాయకులు సత్యనారాయణ, వైజాక్ రవి, రామాంజినేయులు, కణేకల్లు సచివాలయాల కన్వీనర్ హనుమంతరావు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారాలు చేస్తే సహించం

- పచ్చ మీడియాపై గౌనూరు గ్రామస్తుల ఫైర్


తప్పుడు కథనాన్ని ఖండిస్తున్న గౌనూరు గ్రామస్తులు

బొమ్మనహాళ్: ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డిపై తప్పుడు ప్రచారాలు చేస్తే సహించేది లేదని గౌనూరు గ్రామస్తులు తేల్చి చెప్పారు. గౌనూరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంపై పచ్చ మీడియా తప్పుడు ప్రసారాలు, పిచ్చి రాతలతో ప్రజలను తప్పుదోవ పట్టించడాన్ని ఖండిస్తూ సోమవారం గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోవిందు, వంద్రప్ప, లింగప్ప, తిమ్మప్ప, శరణప్ప, కృష్ణప్ప, రామాంజినేయులు, వన్నూరుస్వామి, హనుమంతప్ప, హనుమంతరాయుడు, ఈరన్న, మల్లి తదితరులు మాట్లాడుతూ... ప్రతి ఇంటికి విప్ కాపు తిరిగి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేసి, స్థానిక సమస్యలపై ఆరా తీశారన్నారు. అయితే ఈ విషయాన్ని పక్కదారి పట్టిస్తూ గ్రామస్తుల ఆత్మాభిమానాన్ని దెబ్బతీసేలా కథనాలు ప్రచురించడం బాధాకరమన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.30 లక్షలతో సీసీ రోడ్లు, మినరల్ వాటర్ ప్లాంట్, రూ.28 లక్షలతో పాఠశాల అభివృద్ధి, రూ.2.36 కోట్లతో 4.6 కిలోమీటర్ల రోడ్డును వేశారన్నారు. టీడీపీ హయాంలో అప్పటి మంత్రి కాలవ శ్రీనివాసులు కనీసం గౌనూరు గ్రామం వైపు కన్నెత్తి కూడా చూడలేదన్నారు. మరోసారి తప్పుడు కథనాలు ప్రచురిస్తే సహించేదని లేదన్నారు. కార్యక్రమంలో ఈశ్వరరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రమేష్, యువరాజ్‌స్వామి, గాదిలింగ, వన్నూరుస్వామి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

16 మంది మట్కా బీటర్ల అరెస్ట్

- రూ.5.04 లక్షలు, మట్కా పట్టీలు స్వాధీనం

తాడిపత్రి: మండల వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో మట్కా రాస్తున్న 16 మంది బీటర్లను అరెస్ట్ చేసినట్లు తాడిపత్రి డీఎస్పీ గంగయ్య తెలిపారు. స్థానిక రూరల్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఆయన వెల్లడించారు. తాడిపత్రి రూరల్ సీఐ లక్ష్మీకాంతరెడ్డి, ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌తో కలసి సోమవారంచేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో మట్కా గుట్టు రట్టుయిందన్నారు. గన్నెవారిపల్లి కాలనీతో పాటు ఊరు చింతలలోని పెద్దమ్మ గుడి వద్ద మట్కా నిర్వహిస్తున్న బీటర్లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లికి చెందిన నేతి ప్రసాద్, సైజుగాళ్ల వెంకట్రాముడు, తాడిపత్రి మండలం బుగ్గ, భోగసముద్రానికి చెందిన కటకం లక్ష్మయ్య, జమ్ములపాడు కిట్ట, కొట్టె లక్ష్మీరెడ్డి, సజ్జలదిన్నె నివాసి షేక్ మహబూబ్ బాషా, యర్రగుంటపల్లి నివాసి తలారి నరసింహులు, తాడిపత్రిలోని అంబేడ్కర్ నగర్ నివాసి దూదేకుల వన్నూరమ్మ, పెద్దపొలమడకు చెందిన మంగళి సూర్యనారాయణ, అక్కన్నపల్లి గ్రామానికి చెందిన చిన్నబాలయ్య, రామన్నగారి నాగరాజు, గన్నెవారిపల్లి కాలనీకి చెందిన తలారి బయన్న, దాస్తి సరస్వతి, సుంకులమ్మ పాలెం నివాసి గొల్ల విశ్వనాథ్, వైఎస్సార్ జిల్లా ఆర్ఎస్ కొండాపురం మండలం యర్రగుడి నివాసి అబ్రహాం ఉన్నారన్నారు. వీరి నుంచి రూ.5,04,270 నగదు, మట్కాపట్టీలు, పెన్నులు, 5 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరిచినట్లు వివరించారు.

పిల్లలను పోషించలేక తల్లి ఆత్మహత్యాయత్నం


బాధితురాలితో మాట్లాడుతున్న సీఐ రెడ్డెప్ప

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: కట్టుకున్నవాడు కాదని వదిలేస్తే.. కడుపున పుట్టిన ఇద్దరు బిడ్డలను భుజానేసుకుని బతుకుపోరాటం సాగించిన తల్లి... వారికి కడుపునిండా అన్నం పెట్టలేక తనువు చాలించాలని చూసింది. కలెక్టర్ కార్యాలయంలో ప్రాణాలు వదిలితే అధికారులు కనికరించి తన బిడ్డలను అక్కున చేర్చుకుంటారని భావించింది. సోమవారం పురుగుల మందు తాగి కలెక్టరేట్ ముఖద్వారం వద్ద కుప్పకూలింది. విషయాన్ని గమనించిన పోలీసులు వెంటనే ఆమెను సర్వజనాస్పత్రికి తరలించారు. ఘటనపై వన్‌టౌన్ సీఐ రెడ్డెప్ప ఆరా తీశారు. బాధితురాలు తెలిపిన మేరకు... కంబదూరుకు చెందిన సాకే చంద్రకళ, శ్రీనివాసులు దంపతులు. 9 ఏళ్ల క్రితం చంద్రకళను భర్త వదిలేశాడు. అప్పటికే వారికి ఇద్దరు కుమారులున్నారు. భర్త కాదంటే పాత్తిళలో ఇద్దరు బిడ్డలను తీసుకుని నగరానికి చంద్రకళ వలస వచ్చింది. తపోవనం కూడలిలోని రాయల్ హోటల్‌లో పాచి పనులు చేస్తూ బిడ్డలను పోషించుకుంటోంది. రక్తహీనతతో బాధపడుతున్న ఆమె ఆరోగ్యం క్రమంగా క్షీణిస్తూ వచ్చింది. ఈ నేపథ్యంలో పిల్లల పోషణ భారమైన ఆమె కలెక్టర్‌కు వారిని అప్పగించి తాను చనిపోవాలని నిర్ణయించుకుంది. సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయం బయట పురుగుల మందు తాగి లోపలకు వెళ్లిన ఆమె ఒక్కసారిగా కుప్పకూలడంతో పోలీసులు గుర్తించి ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు ప్రాణాపాయం తప్పినట్లు వైద్యులు తెలిపారు.

క్లుప్తంగా

ద్విచక్ర వాహన దొంగల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలో పార్కింగ్ చేసిన వాహనాలను అపహరించే దొంగలను వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో సీఐ రెడ్డెప్ప వివరాలు వెల్లడించారు. సాయంత్రం నగరంలోని ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన వాహనాలను అపహరించేందుకు యత్నిస్తున్న ఓ యువకుడిని అదుపులోకి తీసుకుని విచారించగా, ఆరుగురు మైనర్లతో బైక్ చోరీలు చేయిస్తున్నట్లు తేలిందన్నారు. దీంతో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ప్రధాన నిందితుడు రాప్తాడు మండలం కేంద్రంలో నివాసం ఉంటున్న సాయి ఈశ్వర్‌ను అరెస్ట్ చేశామన్నారు. నిందితుల నుంచి 9 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్‌ఐ తిప్పేనాయక్, ఏఎస్‌ఐ రమేష్, నాగేశ్వర రెడ్డి, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

కులవృత్తికి చట్టబద్ధత కల్పించండి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న నాయీ బ్రాహ్మణులు

అనంతపురం అర్బన్: తమ కుల వృత్తికి చట్టబద్ధత కల్పిస్తూ జీఓ తీసుకురావాలంటూ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం డిమాండ్ చేశారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు బంకు శీన మాట్లాడుతూ.. క్షౌరవృత్తిలోకి కార్పొరేట్ సంస్థలు, ఇతర కులాల వారు ప్రవేశిస్తుండడంతో కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న తమకు ఉపాధి లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నాయీ బ్రాహ్మణులు తప్ప ఇతరులెవరూ క్షౌరవృత్తి చేపట్టకూడదంటూ ప్రత్యేక జీఓ తీసుకురావాలని కోరుతూ డీఆర్‌ఓ గాయత్రీదేవి ద్వారా ప్రభుత్వానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహులు, నగర అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

తరాల మధ్య వారధి పుస్తకాలే



డిక్షనరీలు అందిస్తున్న ఎంపీ రంగయ్య, పైలా నరసింహయ్య

అనంతపురం: పుస్తకాలే తరాల మధ్య వారధి అని అనంతపురం ఎంపీ తలారి రంగయ్య అన్నారు. అనంతపురం కేంద్ర గ్రంథాలయానికి ఎంపీ ఉచితంగా డిక్షనరీలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. వేసవి సెలవుల్లో విజ్ఞాన శిబిరాలు సమర్థవంతంగా నిర్వహించిన గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఉమామోహన్ రెడ్డి కృషి ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ ఎల్ఎం ఉమామోహన్ రెడ్డి, మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్ రెడ్డి, కార్యదర్శి పి. రమ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి గరికపాటి దీనబాబు

అనంతపురం: మత్తు పదార్థాలను కలిగి ఉన్నా, రవాణా చేసిన , వినియోగించినా చట్టపరంగా నేరమని, నేర తీవ్రతను బట్టి ఏడాది నుంచి యావజ్జీవ కారాగారశిక్ష విధించే అవకాశం ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి గరికపాటి దీనబాబు పేర్కొన్నారు. ప్రపంచ మాదకద్రవ్య వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని న్యాయ సేవాధికార సంస్థ నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆరోగ్యానికి హాని కలిగించే అంశాలకు దూరంగా ఉండాలన్నారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. సమాజానికి హాని చేసే మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ఉంటూ యువత స్ఫూర్తిదాయకమైన జీవితాన్ని అవలంబించాలన్నారు. కార్యక్రమంలో బార్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు ఏ రామిరెడ్డి, దేవదాయ ధర్మాదాయ శాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్, శ్రీ సత్యసాయి విద్యాసంస్థలు (పుట్టపర్తి) ఆచార్యులు దీపక్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికంగా అభివృద్ధి సాధించాలి

- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధి సాధించాలి.. ఇందుకు అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనతోనే జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని సూచించారు. వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం కింద 10 యూనిట్లకు రూ.252.27 లక్షలు, ఇండస్ట్రియల్ పాలసీ కింద రెండు యూనిట్లకు రూ.9.35 లక్షలు, మూడు యూనిట్లకు రూ.7.49 లక్షలు సబ్సిడీ మంజూరుకు ఆమోదం తెలిపారు. సింగిల్ విండో పోర్టల్ వచ్చిన దరఖాస్తులను గడువులోపు ఆమోదించాలన్నారు. పరిశ్రమల స్థాపనకు అనుమతులను నిర్ణీత వ్యవధిలో మంజూరు చేయాలన్నారు. పీఎంఈజీపీ కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 53 యూనిట్లకు రూ.262 లక్షలు బ్యాంకులు మంజూరు చేశాయన్నారు. లక్ష్యాలను రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల డైరెక్టర్‌కు పంపించాలన్నారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాల పంపిణీ

దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను కలెక్టర్ ఎం.గౌతమి పంపిణీ చేశారు. సోమవారం విభిన్న ప్రతిభావంతుల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు క్యాలీపర్స్, చంక కర్రలు కలెక్టర్ అందించారు. హిందూపురానికి చెందిన గంగరాజు, గుత్తి మండలం ఇమాంపురానికి చెందిన గోవిందుకు కృత్రిమ కాలు అందజేశారు. ధర్మవరానికి చెందిన పార్వతమ్మకు క్యాలీపర్, ఎల్లనూరుకు చెందిన వెంకటరాముడుకు చంక కర్రలు అందజేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ అబ్దుల్ రసూల్, హౌసింగ్ పీడీ కేశవనాయుడు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ జ్యోతి పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'ను జయప్రదం చేద్దాం



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి



44వ డివిజన్‌లో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య

అనంతపురం క్రైం: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి కోరారు. సోమవారం నగరంలోని 5,7 సచివాలయాలకు సంబంధించి 5వ డివిజన్‌లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం వర్తింపజేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరో బృహత్తర కార్యక్రమానికి చర్యలు శ్రీకారం చుట్టారన్నారు. ప్రతి ఇంటికీ తిరిగి సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఆర్ఐ మురళీ, కార్పొరేటర్ జయలలిత, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

కమలానగర్‌లో రూ.20 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న రోడ్లు, డ్రైనేజ్ పనులకు స్థానిక కార్పొరేట్ అబూసలేహాతో కలసి డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఈఈ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే లక్ష్యం

ప్రజా సంక్షేమం అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం పేరిట మరో బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య తెలిపారు. సోమవారం నగరంలోని 44వ డివిజన్ రెండో రోడ్డులో జరుగుతున్న సర్వేను డిప్యూటీ మేయర్ పరిశీలించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమం అందుతోందో లేదో తెలుసుకోవాలన్నారు. ఎవరికైనా ఏదైనా ఇతరత్ర కారణాలతో సంక్షేమం అందకపోయి ఉంటే వారి వివరాలు సేకరించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొండమ్మ, మధు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



జంగాలపల్లిలో జగనన్న సంక్షేమ స్టిక్కర్ అందిస్తున్న నాయకులు

అర్హులందరికీ పథకాలు వర్తింపజేయాలి

రాప్తాడురూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు వర్తింపజేయాలని, వివిధ కారణాల వల్ల సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించేందుకు ప్రభుత్వం 'జగనన్న సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎంపీడీఓ గుజ్జల వరలక్ష్మి, ఎంపీడీఓ వై.పుల్లయ్య, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం అనంతపురం రూరల్ మండలం కందుకూరు సచివాలయం-2లో సర్పంచ్ బి. ప్రశాంత్‌కుమార్ అధ్యక్షతన 'జగనన్న సురక్ష' కార్యక్రమంపై సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు అవగాహన కల్పించారు. అనంతరం జంగాలపల్లి, కృష్ణంరెడ్డిపల్లి గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటస్వామి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దుగుమర్రి గోవిందరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ పెరవలి జయ చంద్రారెడ్డి, ఎంఎల్ఓ కేదార్‌నాథ్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రాగే రేవతి పెద్దప్ప, ఉప సర్పంచ్ కేపీ ఓబులేసు, పంచాయతీ కార్యదర్శులు నరసింహారెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, వీఆర్ఓ గోవిందనాయక్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్ఎస్ విద్యార్థుల కృషి అభినందనీయం



రథయాత్ర మెమొంటో అందిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: జగన్నాథ రథయాత్ర విజయవంతం కావడానికి వలంటీర్లు చేసిన కృషి అభినందనీయమని ఇస్కాన్ చైర్మన్ దామోదర గౌరంగ దాసు అన్నారు. సోమవారం సాయంత్రం ఇస్కాన్ గోశాల ప్రాంగణంలో ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్కాన్ రథోత్సవ కమిటీ సభ్యులు శ్రీపాద వేణు, రంగారెడ్డి, రఘు తదితరులు మాట్లాడుతూ పూరీ రథోత్సవ వేడుకలు జిల్లాలో అత్యంత ఘనంగా జరగానికి ఎంతో మంది ఆధ్యాత్మిక వేత్తలు, కళాకారులు సహకరించారన్నారు. సమయాభావం వల్ల పాతూరు వీధుల్లో రథయాత్ర వెళ్లకలేకపోయిందన్నారు. ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నాగశుభకు, విద్యార్థులకు ఇస్కాన్ రథయాత్ర చిత్రపటాలు, సర్టిఫికెట్లు అందించి సత్కరించారు. అనంతరం వందలాది మందికి ప్రత్యేకంగా రాజమండ్రి నుంచి తెప్పించిన ఇస్కాన్ ప్రసాదం అందించారు.

బాలికకు పోతుల సునీత పరామర్శ

అనంతపురం క్రైం: లైంగిక దాడికి గురై సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉరవకొండకు చెందిన బాలికను ఎమ్మెల్సీ పోతుల సునీత సోమవారం పరామర్శించారు. జరిగిన ఘటనకు చింతిస్తున్నామని, బాధ్యులపై చర్యలు ఉంటాయని, ప్రభుత్వం అండగా ఉంటుందని బాలిక తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, నగరాధ్యక్షురాలు కృష్ణవేణి, రాష్ట్ర కార్యదర్శి కొండమ్మ, తదితరులు పాల్గొన్నారు.

యథాస్థితిలో చిన్నారి ఆరోగ్యం

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని చిన్నపిల్లల వార్డులో చికిత్స పొందుతున్న చిన్నారి లేఖ్య రెడ్డి ఆరోగ్యం యథాస్థితిలో ఉంది. చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ రవికుమార్ పర్యవేక్షణలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శంకర్ నారాయణ, పీజీ వైద్యులు చిన్నారి స్పృహలోకి రావడానికి వివిధ రకాల యాంటీబయాటిక్స్ అందించేలా చర్యలు తీసుకున్నారు.

సజావుగా సచివాలయ ఉద్యోగుల బదిలీ



పోస్టింగ్ ఉత్తర్వులు అందజేస్తున్న మునిసిపల్ ఆర్‌డీ పీవీవీఎస్ మూర్తి

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ, మునిసిపాలిటీల్లోని సచివాలయాల ఉద్యోగుల బదిలీల ప్రక్రియ సోమవారం నగరపాలక సంస్థలో సజావుగా జరిగింది. మునిసిపల్ ఆర్‌డీ పీవీవీఎస్ మూర్తి, నగరపాలక సంస్థ కమిషనర్ రమణారెడ్డి బదిలీ కౌన్సెలింగ్‌ను పర్యవేక్షించారు. కౌన్సిల్ హాలులో స్పౌజ్, మ్యూచ్‌వల్ కేటగిరీల్లో 36 మంది బదిలీలు జరిగాయి. 124 మంది పారిశుధ్య, వెల్ఫేర్, అడ్మిన్, ఎడ్యుకేషన్‌ల బదిలీలు నగరపాలక సంస్థలోని నూతన భవనంలో జరిగాయి. అంతర్ జిల్లాలకు దాదాపుగా 130 మంది బదిలీకాగా.. మిగతా వారు యథాస్థానాలనే కోరుకున్నారు.

ప్రభుత్వం మంచి అవకాశం కల్పించింది..

సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం బదిలీల ద్వారా మంచి అవకాశం కల్పించిందని మునిసిపల్ ఆర్‌డీ మూర్తి పేర్కొన్నారు. సోమవారం బదిలీ అయిన ఉద్యోగులకు ఆయన పోస్టింగ్ ఉత్తర్వులను అందజేశారు. ప్రతి ఒక్కరూ రెట్టింపు ఉత్సాహంతో పని చేసి ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్లు శేషన్న, మధుసూదన్‌రెడ్డి, హరిబాబు, శోభన్‌రెడ్డి, నగరపాలక సంస్థ ఆర్ఓ సతీష్ పాల్గొన్నారు.

డీజిల్ లేక బస్సుయాత్రకు అంతరాయం



గొందిరెడ్డిపల్లిలో ఆగిపోయిన బస్సు ఇదే

రాప్తాడు: 'భవిష్యత్‌కు గ్యారెంటీ' పేరిట టీడీపీ నేతలు చేపట్టిన బస్సుయాత్ర మధ్యలో ఆగిపోయింది. సోమవారం మాజీ మంత్రి పరిటాల సునీత ఆధ్వర్యంలో భవిష్యత్‌కు గ్యారెంటీ పేరుతో నియోజకవర్గంలో బస్సుయాత్ర చేపట్టా రు. ఉదయం 8 గంటలకు బస్సుయాత్ర రాప్తా డులో ప్రారంభం కావాల్సి ఉంది. అయితే ఉదయం 10.30 గంటలకు రావడంతో దాదాపుగా 2.30 గంటల ఆలస్యంతో బస్సు యాత్ర ప్రారంభమైంది.

డ్రైవర్‌పై కస్సు'బస్సు'...

రాప్తాడు నుంచి బస్సు యాత్ర రామినేపల్లి మీదుగా గొందిరెడ్డిపల్లి వద్ద తుమ్మచెట్ల సమీపంలో గుట్ట వద్ద ఆగింది. దీంతో బస్సు ఎందుకు ఆగిపోయిందని టీడీపీ నాయకులు డ్రైవర్‌ను అడగ్గా, డీజిల్ అయిపోయిందని చెప్పడం గమనార్హం. కాగా బస్సులో డీజిల్ స్టాకు పెట్టకుండా బస్సు ఎందుకు నడుపుతున్నావని డ్రైవర్‌పై టీడీపీ నాయకు లు కసురుకున్నట్లు సమాచారం. బస్సు అనుకున్న సమయానికి గొందిరెడ్డిపల్లికి చేరకపోవడంతో అక్కడున్న మహిళలు, టీడీపీ నాయకులు ఇళ్లకు వెనుదిరిగి వెళ్లిపోయారు. బస్సుయాత్ర గొందిరెడ్డిపల్లి, యర్రగుంట గ్రామాల మీదుగా ఎం. బండమీదపల్లికి మధ్యాహ్నం 1 గంటకు చేరుకోవా ల్సి ఉండగా, మధ్యాహ్నం 2.30 గంటలకు చేరుకుంది. బస్సు యాత్ర ఆలస్యం కావడంతో ఎం.బండమీదపల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు జనాలు లేక వెలవెలబోయింది. బస్సుయాత్ర గమ్యస్థానానికి చేరుతుందోలేదో ఆపార్టీ నాయకులకే తెలియదు.. ఇక మా 'భవిష్యత్తుకు ఎక్కడ గ్యా రెంటీ' కల్పి స్తారని నియోజకవర్గ ప్రజలు చర్చించుకోవడం కొసమెరుపు.

మైనార్టీల సంక్షేమానికి సీఎం జగన్ ప్రాధాన్యత



కరపత్రాలు విడుదల చేస్తున్న మేయర్ వసీం, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్

అనంతపురం సిటీ: వైఎస్ కుటుంబం ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తోందని, రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తోందని నగర మేయర్ మహమ్మద్ వసీం, ఉర్దూ అకాడమీ రాష్ట్ర చైర్మన్ నదీమ్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజీఘర్ రిజ్వాన్ అన్నారు. సోమవారం హౌసింగ్ బోర్డులోని మస్జీదే బియాబని మసీదులో 'హర్ దిల్ మే వైఎస్సార్-హమ్ సబ్ జగన్‌కే సాత్' కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా బేగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి పైన పేర్కొన్న ముగ్గురు ప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న ముస్లిం మైనార్టీల అభ్యున్నతి రాజకీయ ప్రాధాన్యంతోనే సాధ్యమని భావించి వైఎస్ఆర్ అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. నాలుగు శాతం రిజర్వేషన్ అమలు చేసి, విద్య, ఉద్యోగాల్లోనే కాకుండా రాజకీయంగానూ ప్రాధాన్యం ఇచ్చి అనేక పదవుల్లో నియమించారన్నారు. తండ్రి బాటలోనే తనయుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కూడా ముస్లింలకు రాజకీయంగా సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రహంతుల్లా, ఇషాక్, బాబాఫక్రుద్దీన్, కోఆప్షన్ సభ్యుడు షంషుద్దీన్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొర్రపాడు హుస్సేన్‌పీరా, నాయకులు జక్రియా (రిటైర్డ్ హెడ్మాస్టర్), ముహీబ్, ఏ-1 రఫీ, జావిద్, మజీద్, ముతవల్లి షాకీర్, ఇమాం, మహమ్మద్, బషీర్, మహబూబ్‌బాషా, నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనలకు పకడ్బందీ ఏర్పాట్లు

అనంతపురం సిటీ: ముస్లింలు త్యాగానికి ప్రతీకగా భావించే ఈద్-ఉల్-జుహా (బక్రీద్) పండుగ ఏర్పాట్లను మేయర్ వసీం , ఉర్దూ అకాడమీ చైర్మన్ హిరియల్ నదీమ్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజీఘర్ రిజ్వాన్ సోమవారం పరిశీలించారు. ఈ నెల 29న జరగనున్న బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని నగరంలోని హౌసింగ్ బోర్డులోని ఈద్గాలో జరుగుతున్న పనులను వారు పరిశీలించారు. వేలాదిగా తరలివచ్చే ముస్లింలను దృష్టిలో పెట్టుకొని ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణ, నీటి వసతి, ప్రత్యేక ప్రార్థనలకు అవసరమైన సౌకర్యాలన్నీ తక్షణం పూర్తి చేయాలని సిబ్బందితో పాటు బాధ్యులను ఆదేశించారు. ఈద్గాతో పాటు మసీదుల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు జరగనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రహంతుల్లా, ఇషాక్, బాబాఫక్రుద్దీన్, కోఆప్షన్ సభ్యుడు షంషుద్దీన్, మత పెద్దలు పాల్గొన్నారు.

శ్రీరామకోటి రాతకు నగదు బహుమతులు

అనంతపురం కల్చరల్: వైఎస్సార్ కడప జిల్లా ఒంటిమిట్ట క్షేత్రంలో సనాతన సంప్రదాయాలను గౌరవిస్తూ శ్రీరామ కోటి పుస్తకాలను భద్రపరుస్తున్నట్లు జిల్లా అవోపా అధ్యక్షుడు జయంతి శ్రీనివాసులు శెట్టి తెలిపారు. అవోపా (ఆర్యవైశ్య ఆఫీసర్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్), ఆనంద సేవ సంస్థ వారు శ్రీరామకోటి పుస్తకాలు రాసేవారిని ప్రోత్సహిస్తున్నామని, అందులో భాగంగా లక్ష నామాల రామకోటి రాసే వారికి ద్రా ద్వారా రూ.2,007, రెండో బహుమతి రూ.1,008, మూడో బహుమతి కింద రూ.504 నగదు బహుమతులు అందిస్తామన్నారు. వివరాలకు సెల్: 7013776329లో సంప్రదించాలన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: నగరంలో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ సీఐ వెంకటేశ్‌నాయక్ తెలిపారు. సోమవారం నగరంలోని పలు కూడళ్లలోని ఆటో స్టాండ్లు, వాహనాల యజమానులతో మాట్లాడారు. ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు ఇబ్బందులకు గురికాకుండా ప్రతి వాహనదారుడూ సహకరించాలని సూచించారు. చిరువ్యాపారులు ఇబ్బందిలేకుండా తోపుడుబండ్లు ఆపుకోవాలని, రోడ్డుపైకి తెచ్చి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దన్నారు. నగర వాసులు ప్రదానంగా రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ పోలీసుల సూచనలకు సహకరించాలన్నారు.

అగ్ని ప్రమాదాలు జరగకుండా చూడాలి

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: అగ్ని ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని బీసీ ఐక్యవేదిక నేతలు కోరారు. సోమవారం బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర అగ్నిమాపక కార్యాలయంలో డిప్యూటీ డీఎఫ్ఓకి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా బీసీ ఐక్యవేదిక నాయకులు రామలింగం మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు, హాస్పిటల్స్‌లో ఫైర్ పరికరాలు లేకున్నా విద్యాధికారులు, వైద్యాధికారులు అనుమతులు ఇస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డీకే రామలింగం, పురుషోత్తం, వెంకటేష్, అనిల్, శశి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎన్‌జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి

అనంతపురం క్రైం: నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో విధులు నిర్వర్తించే ఉద్యోగుల న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని ఎన్‌జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, ఎన్‌హెచ్ఎం గౌరవాధ్యక్షుడు శ్రీధర్‌బాబు, అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం డీఎంహెచ్ఓ కార్యాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం వారు డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఉన్న పీసీపీఎన్‌డీటీ యాక్ట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ యుగంధర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎం ప్రోగ్రాం అధికారులు కిశోర్, ఫణి, జిల్లా ఎపడమాలజిస్టు వేణు, అంజి, ఎన్‌సీడీ ఏఓ ప్రేమ్, త్రిలోక్, డీఈఐసీ వైద్యురాలు డాక్టర్ ముత్యాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్సుల చేరిక

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సోమవారం 17 మంది స్టాఫ్‌నర్సులు, ఒక హెడ్ నర్సు విధుల్లో చేరారు. సాధారణ బదిలీల్లో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి వీరు అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రికి వచ్చారు. మొదటగా నర్సింగ్ సూపరింటెండెంట్ మంజు, గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్ రజిని వద్ద రిపోర్టు చేసుకున్నారు.

డీఎల్ఏటీ అధికారిగా డాక్టర్ మనోజ్

అనంతపురం క్రైం: జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారిగా డాక్టర్ మనోజ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఆ స్థానంలో ఉన్న డాక్టర్ అనుపమ జేమ్స్ హిందూపురానికి బదిలీ కావడంతో కురుకుంట మెడికల్ ఆఫీసర్ మనోజ్‌కుమార్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సోమవారం సర్వజనాస్పత్రిలోని డీఎల్ఏటీ కార్యాలయానికి చేరుకున్న డాక్టర్ మనోజ్ కుమార్‌ను సిబ్బంది స్వాగతం పలికి అభినందించారు.

డాక్టర్ రఘునందన్ సేవలు మరువలేనివి



సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్ సేవలు మరువలేనివని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి పేర్కొన్నారు. ఇటీవల డాక్టర్ రఘునందన్ అడిషినల్ డీఎంఈగా నియమితులైన విషయం విదితమే. వైద్య కళాశాలలోని సెంట్రల్ హాల్‌లో రఘునందన్‌కు ఆత్మీయ అభినందన సభ ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రఘునందన్ వైద్యుడిగా, పరిపాలనాధికారిగా ఉత్తమ సేవలందించారన్నారు. డాక్టర్ రఘునందన్ మాట్లాడుతూ ఇక్కడి ప్రభుత్వ వైద్య కళాశాలలో మెరుగైన సదుపాయాలు, వైద్య విద్య, పచ్చదనం, పరిశుభ్రత ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. ప్రొఫెసర్లు డాక్టర్ రామస్వామి నాయక్, డాక్టర్ కేఎల్ సుబ్రమణ్యం, డాక్టర్ ఆత్మారాం, డాక్టర్ శివశంకర్ నాయక్, వైద్యులు డాక్టర్ శంకర్‌నారాయణ, డాక్టర్ సుభాష్‌చంద్రబోస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, ఏడీ నాగరత్నమ్మ, ఆఫీసు సూపరింటెండెంట్లు రవికుమార్, హరిశంకర రావు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం సెంట్రల్: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కళ్యాణదుర్గంలో మంత్రి ఉషశ్రీచరణ్‌ను యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకులు జమున, రమాదేవి, పలువురు యూనియన్ ముఖ్య నాయకులు కలిసి వినతిపత్రం అందించారు. అంగన్‌వాడీ సిబ్బందిపై వేధింపులు అధికమవుతున్నాయని, ఇటీవల ప్రకాశం జిల్లాలో ఓ కార్యకర్త ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తు చేశారు. డిమాండ్‌లను పరిష్కరించాలని, లేని పక్షంలో జూలై 10,11 తేదీల్లో ఆందోళనలు చేపడతామని తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించి, సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు యూనియన్ నాయకులు తెలిపారు.

స్పందనపై అధికారులు నిర్లక్ష్యం

ఆత్మకూరు: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమంపై అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రతి సోమవారం స్పందన కార్యక్రమానికి నామమాత్రంగా వచ్చి రికార్డుల్లో సంతకాలు చేసి వెళ్తున్నారు. సమస్యలపై వచ్చిన ప్రజలు అధికారుల కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి వచ్చింది.

నేడు నీటి సరఫరా బంద్

అనంతపురం క్రైం: నగరంలో మంగళవారం నీటి సరఫరా ఉండదని నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజనీర్ సతీష్ చంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలకు సరఫరా చేసే తాగునీటి మెయిన్ పంపింగ్ లైన్‌కు సంబంధించి లక్ష్మీనగర్ ట్యాంక్ వద్ద మరమ్మతులు చేస్తున్నట్లు తెలిపారు. మంగళవారం సాయంత్రం అందించే కాలనీలకు నీటి సరఫరా ఉండదన్నారు.

కుష్టు నిర్ధారణ సర్వే విజయవంతం చేయాలి

అనంతపురం క్రైం: కుష్టు నిర్ధారణ సర్వే విజయవంతం చేయాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ మనోజ్ కోరారు. సోమవారం నాయక్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో కుష్టు నిర్ధారణ పరీక్షలను ఆయన ప్రారంభించారు. సోమవారం నుంచి నెల జూలై 16 వరకు నగరంలోని వివిధ అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సాకే చంద్రశేఖర్, వైద్యులు అన్వర్ బాషా, జ్యోత్స్న, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆత్మకూరు: కుష్టు నివారణపై జూలై 16 వరకు మండలంలోని గ్రామాల్లో ఇంటింటా సిబ్బంది సర్వే చేస్తున్నట్లు డాక్టర్ సబిహా తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వాస్పత్రి నుంచి ర్యాలీ చేశారు. ఎంపీహెచ్ఓ నాగేశ్వరయ్య, మునాఫ్, వైద్య సిబ్బంది తులసమ్మ, రత్నమ్మ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో సిబ్బంది బాధ్యతల స్వీకరణ

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో సోమవారం కొందరు సిబ్బంది బాధ్యతలు చేపట్టారు. కర్నూలులో ఏఓగా ఉన్న మక్బూల్, బొమ్మనహాల్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న నీలకంఠం నాయుడు, తరిమెలలో సీనియర్ అసిస్టెంట్ ఉన్న బెన్నీ జేవియర్, కృష్ణాపురంలో సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న మాధవీలత ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఏఓగా పని చేస్తున్న భానుమతి, సీనియర్ అసిస్టెంట్ శివప్రసాద్ తిరుపతికి బదిలీ అయ్యారు.

'స్పందన'లో 10 వినతులు

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో 10 వినతులు అందాయి. ఏసీపీ బాలాజీ, ఎంహెచ్ఓ డాక్టర్ గంగాధర్ రెడ్డి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్లు ఖయూం, విజయకుమార్, దేవశంకర్, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.